క్లుప్తంగా

మొరాయించిన చెత్త బండి



ప్రత్తిపాడు: స్వచ్ఛతపై యంత్రాంగం చెప్పే మాటలు కోటలు దాటుతుంటే.. క్షేత్ర స్థాయిలో చెత్తను తరలించే వాహనాలు మాత్రం మొరాయించి ముందుకు కదలనంటున్నాయి. అలాంటి చిత్రమే ఇది. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు గ్రామ పంచాయతీలోని గ్రీన్ ఆంధ్రప్రదేశ్ వాహనం ఇలా ముందుకు కదలనంటూ మొండికేసింది. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో, చేసేదేమీ లేక ఇదిగో ఇలా పారిశుద్ధ్య కార్మికులు వాహనానికి తాడు కట్టి ట్రాక్టర్‌తో లాగించారు.

విద్యుత్ వైర్లు చోరీపై ఫిర్యాదు

పెదకాకాని: మల్లేశ్వరస్వామి దేవస్థానం దసరా ఉత్సవాల సందర్భంగా పెదకాకాని ఆర్చి సెంటర్ వద్ద, ఆలయ ఆర్చి గేటు వద్ద విద్యుత్ దీపాలంకరణ, అమ్మవారి కటౌట్‌లు ఏర్పాటు చేయుటకు గ్రామానికి చెందిన వ్యక్తి టెండరు ద్వారా పనులు దక్కించుకున్నారు. టెండర్ పొందిన వ్యక్తి ఈ నెల 22వ తేది రాత్రి లైటింగ్, కటౌట్ స్టాండ్లు ఏర్పాటు చేశాడు. రాత్రి వేళ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ దీపాలకు సంబంధించిన కటౌట్ స్టాండ్స్ తొలగించడంతో పాటు విద్యుత్ వైర్లు కత్తిరించి తీసుకువెళ్లారు. దీనిపై ఆలయ డీసీ గోగినేని లీలాకుమార్ ఆదేశాల మేరకు సీనియర్ అసిస్టెంట్ యంపరాల బసవ శంకర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టి.పి.నారాయణస్వామి తెలిపారు.

ఇంటింటి సర్వే నిర్వహించాలి



పాంద్రపాడు(కాకుమాను): ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేయాలని తహసీల్దార్ బి.వెంకటస్వామి అన్నారు. మండలంలోని పాంద్రపాడు, కాకుమాను పీహెచ్‌సీ సిబ్బందికి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేయాలని ఆయన ఆదేశించారు. జ్వరాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే వారికి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీరు తాగేలా అవగాహన కల్పించాలన్నారు. కాకుమాను, పాంద్రపాడు వైద్యులు స్వర్ణ రాజశేఖర్, ఎం.శ్రీధర్, హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పొన్నూరు అమీర్ మృతి

చేబ్రోలు: పొన్నూరుకు చెందిన ప్రముఖ ధార్మికవేత్త, తబ్లిగ్ జమాత్ పొన్నూరు అమీర్ (ఇన్‌చార్జి)గా వ్యవహరిస్తున్న మహ్మమద్ మగ్బుల్ జానీ బేగ్ (74) మంగళవారం చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. పొన్నూరు పట్టణానికి చెందిన మగ్బుల్ జానీ బేగ్ దంపతులు పెదకాకానిలోని శంకర్ కంటి వైద్యశాలకు స్కూటీపై వెళుతుండగా మార్గంమధ్యలో నారాకోడూరు శివారులో స్కూటీ వెనుక టైర్ పగిలిపోయింది. దీంతో స్కూటీ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. భార్యభర్తలు ఇరువురు రోడ్డుపై పడిపోయారు. జానీబేగ్‌కు తలకు, ముఖానికి బలమైన గాయాలవటంతో వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. జానీ బేగ్ మూడున్నర దశాబ్దాలుగా పొన్నూరు మండల అమీర్‌గా వ్యవహరిస్తున్నారు. కుమారుడు అహ్మద్ ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ పి.వీరనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమష్టి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి: ఎంపీపీ



ప్రత్తిపాడు: సమష్టి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీపీ దాసరి అన్నమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో కె.శివపార్వతి ఆధ్వర్యంలో ఓఎస్ఆర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు రోజుల పాటు జరగనున్న శిక్షణ కార్యక్రమాన్ని తొలిరోజు ఎంపీపీ దాసరి అన్నమ్మ, సర్పంచ్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలన్నారు. ఎంపీడీవో శివపార్వతి మట్లాడుతూ గ్రామ పంచాయతీలు ఆదాయాన్ని పెంచుకునే దిశగా కృషి చేయాలన్నారు. పంచాయతీలు ఎలా ఆదాయాన్ని సృష్టించుకోవాలి అనేది వివరించేందుకే ప్రభుత్వం శిక్షణ ఇస్తుందన్నారు. తొలుత టీవోటీలు షేక్ ఖాజా, మూర్తి, డిప్యూటీ ఎంపీడీవో షఫీలు గ్రామ పంచాయతీలకున్న ఆదాయ వనరులు, వాటి వినియోగం.. వంటి అంశాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు.

లోకమాత.. పావని

ప్రత్తిపాడు: దసరా ఉత్సవాలతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. లోకమాత జగజ్జనని దుర్గామాత ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు మంగళవారం ప్రత్తిపాడులోని గంగా పార్వతీ సమేత దండేశ్వరాలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా, వేణుగోపాలస్వామి, సీతారామస్వామి, అద్దంకమ్మ తల్లి దేవస్థానాల్లో గజలక్ష్మిగా లోకమాత భక్తులకు దర్శనమిచ్చింది. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీలు భక్తులకు తీర్థప్రసాదాలను అందించాయి. స్థానిక అంకమ్మగుడి దేవాలయంలోనూ దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.



ప్రత్తిపాడు దండేశ్వరాలయంలో...



అద్దంకమ్మ తల్లి దేవాలయంలో...



నల్లపాడులో గాయత్రీదేవి అలంకారంలో...

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడు గ్రామంలో వేంచేసియున్న అగస్తేశ్వరస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారికి గాయత్రీదేవిగా అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. జొన్నలగడ్డ గ్రామంలో వంగా నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గ్రామంలోని రెడ్ల సంఘం నేతృత్వం వహిస్తున్న మండపంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వంగా తిరుమలరెడ్డి దంపతులు అమ్మవారికి కుంకుమార్చనలు, అభిషేకాలు చేశారు.

స్వర్ణభారతినగర్‌లో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం

గుంటూరు రూరల్: నిషేధిత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సౌత్ డీఎస్పీ భానోదయ తెలిపారు. మంగళవారం 41వ డివిజన్ స్వర్ణభారతినగర్‌లో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీస్ శాఖ, ఈగల్ విభాగంతో కలసి ప్రత్యేకంగా డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వాడకం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, ప్రతి యువకుడు, ప్రతి వ్యక్తి డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని సంకల్పం చేసుకోవాలన్నారు. డ్రగ్స్ సరఫరా, విక్రయం, వాడకం చట్ట రీత్యా నేరమని, అటువంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ వంశీధర్, ఎస్సై శిరీష, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



డ్రగ్స్ వద్దుబ్రో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ భానోదయ తదితరులు

హ్యాకథాన్‌లను సద్వినియోగం చేసుకోవాలి

కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న జ్యూరీ ప్రతినిధులు

ప్రత్తిపాడు: విద్యార్థులు కళాశాలల్లో నిర్వహించే హ్యాకథాన్‌లను సద్వినియోగం చేసుకోవాలని.. కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో 4వ సంవత్సరం విద్యార్థులకు మెషిన్ లెర్నింగ్, ఏఐపై హ్యాకథాన్ నిర్వహించారు. ఇదే కళాశాలలో వారం కిందట జరిగిన ఏఐ, బూట్ క్యాంప్, ఐడియాథాన్‌ల్లో 48 బృందాలు పాల్గొని చేసిన వినూత్న ఆవిష్కరణలను ఆయా సాఫ్ట్‌వేర్ కంపెనీలకు చెందిన జ్యూరీ ప్రతినిధులు రాజేష్ (ఇన్ఫోసిస్ ప్రాజెక్ట్ మేనేజర్), పవన్ విజయ్‌కుమార్ (నిఫూటెక్ గ్లోబల్ ప్రై.లిమిటెడ్), భానుప్రకాష్, శివ బోయపాటి (టెక్నో ఫ్యూచర్ ఇండియా)లు పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులకు జ్యూరీ ప్రతినిధులు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.రమేష్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన ఫార్మా కో విజిలెన్స్ వారోత్సవాలు

గుంటూరు రూరల్: నగర శివారులోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మా కో విజిలెన్స్ వారోత్సవాలను నిర్వహించారు. కళాశాల, ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్, ఫార్మా కో విజిలెన్స్ ప్రోగ్రాం ఆఫ్ ఇండియా, ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. కార్యక్రమంలో 'యువర్ సేఫ్టీ జస్ట్ ఏ క్లిక్ అవే, రిపోర్ట్ టు పీవీపీఎల్' అనే థీమ్‌ను ఈ ఏడాది ప్రారంభించారు. కార్యక్రమానికి చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న హైదరాబాద్ ప్రాఫార్మాగ్రూప్ ఫార్మా కో విజిలెన్స్ సేఫ్టీ సైంటిస్ట్ డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ సేఫ్టీ, ఫార్మ కో విజిలెన్స్, కరంట్ ట్రెండ్స్ అండ్ ఫ్యూచర్ పర్స్పెక్టివ్ అనే అంశాలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ కార్యక్రమంలో అనేక పోటీలు, సృజనాత్మక, శాస్త్రీయ కార్యక్రమాలు నిర్వహించటం జరిగిందన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విజేతలతో కళాశాల యాజమాన్యం

చిన్నారులకు బలమైన ఆహారం అందించాలి

ప్రత్తిపాడు: చిన్నారులకు బలమైన పౌష్టికాహారం అందించాలని ప్రత్తిపాడు కో లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. పోషణ్ మాసోత్సవాలలో భాగంగా మంగళవారం తిక్కిరెడ్డిపాలెం, నడింపాలెం-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్లతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను సర్పంచ్ మాకినేని జగన్‌మోహన్‌రావు, దుర్గాప్రసాద్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన నుంచి ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు. అనంతరం అనుబంధ ఆహారం అందించాలని సూచించారు. ప్రస్తుతం వానల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆయా సెక్టార్‌ల సూపర్‌వైజర్లు ఎస్.భారతి, పి.మాధవి, ఎంపీహెచ్ఈవో చెల్లమ్మ, పీహెచ్ఎన్ నిర్మల, ఎంఎల్‌హెచ్‌పీ స్రవంతి, ఏఎన్ఎం పరమేశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.



పోషకాహార ప్రదర్శనను తిలకిస్తున్న వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్, సర్పంచ్

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

పాంద్రపాడు(కాకుమాను): తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తయారు చేసుకోవాలని పాంద్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హేమలత అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ నిర్వహిస్తున్న పోషణ్ మాసోత్సవాలలో భాగంగా మండలంలోని పాంద్రపాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ గర్భిణులు ప్రతి రోజు పోషకాహారం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పోషకాహారాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పాంద్రపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ప్రేమలత, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పోషకాహారంపై గర్భిణులకు వివరిస్తున్న సూపర్‌వైజర్ ప్రేమలత

పురుగుమందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

చేబ్రోలు: కుటుంబ సమస్యల కారణంగా వృద్ధుడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో మంగళవారం జరిగింది. ఏలూరు ప్రాంతానికి చెందిన బుద్ధి గోవింద్ (70) ఇంటిలో కుటుంబ సమస్యలతో సతమతమవుతున్నాడు. అక్కడ నుంచి ఎవరికి తెలియకుండా బస్సులో చేబ్రోలు వచ్చి పాత పోలీసు స్టేషన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకొని మరణించాడు. మృతుని బంధువులకు తెలియజేయటంతో ఘటనా ప్రాంతానికి చేరుకొని గోవింద్‌ను గుర్తించారు. మృతుని మనవడు గోవింద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చేబ్రోలు ఎస్ఐ పి.వీరనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

• రోడ్డుపైనే మురుగు నీరు

గుంటూరు రూరల్: మండలంలోని అంకిరెడ్డిపాలెం గ్రామం దాసులపాలెంలో మురుగు నీరు పారుదల లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. మురుగు నీరు పారేందుకు వీలు లేక రోడ్లపై నిలబడి దోమలతో విషజ్వరాల బారిన పడుతున్నామని అంటున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవట్లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, వాటర్ పైప్‌లైన్ లేక వీధి చివర నుంచి సైడ్ కాలవలో వాటర్ పైప్స్ వేసుకొని తాగునీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, పైప్‌లైన్‌లకు రంధ్రాలు ఏర్పడి మురుగు నీరు కలిసిపోయి తాగునీరు సరఫరా జరుగుతుందని వాపోతున్నారు. ఈ నీటిని తాగటం వల్ల ప్రతి ఇంటిలో ఒకరిద్దరు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అనేకసార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవటం లేదని అంటున్నారు. వ్యాధులు వచ్చి ప్రాణ నష్టం జరగక ముందే తగిన చర్యలు తీసుకొని డ్రైనేజీలు నిర్మించి, వాటర్ పైప్‌లైన్లను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

ఇళ్లు కూల్చవద్దని వినతి

ప్రత్తిపాడు: గుంటూరు-పర్చూరు రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామంలోని ఇళ్లను కూల్చకుండా గ్రామం బయటి నుంచి బైపాస్‌ను నిర్మించాలని ప్రత్తిపాడుకు చెందిన గంగిరెడ్డి చెన్నారెడ్డి జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించారు. గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా విస్తరించేందుకు సర్వే జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం చెన్నారెడ్డి గుంటూరులో డీఆర్వోతో పాటు ఆర్ అండ్ బీ అధికారులను కలిసి గ్రామస్తుల సంతకాలతో అర్జీ అందజేశారు. గ్రామంలో ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపులా సుమారు 70 నివాస గృహాలున్నాయని, రోడ్డు విస్తరణ జరిగితే వారంతా నిరాశ్రయులవుతారని డీఆర్వోకు వివరించారు. నాలుగు లైన్ల రోడ్డును గ్రామంలో నుంచి కాకుండా బైపాస్‌గా నిర్మించాలని విన్నవించారు. అంతేకాక ఆయా గృహాల వారంతా రైతులు, వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారేనని, గత మూడు నాలుగేళ్లగా పంటలు సరిగా పండక ఇబ్బందుల్లో ఉన్నారని, ఇప్పుడు ఇళ్లు కూడా కోల్పోతే వారంతా రోడ్డున పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.



మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణంపై శిక్షణ

ప్రత్తిపాడు: మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణాన్ని పక్కాగా చేపట్టాలని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ అన్నారు. ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని బొర్రావారిపాలెం గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా మ్యాజిక్ డ్రైన్‌ను నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణంపై గ్రామంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మ్యాజిక్ డ్రెయిన్‌ను ఎలా నిర్మించాలి.. నిర్మాణంలో జాగ్రత్తలు.. ప్రయోజనాలు.. మురుగు పారే విధానం.. వంటి అంశాలపై సిబ్బందికి డైరెక్టర్ షణ్ముఖ ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న మ్యాజిక్ డ్రెయిన్ వలన మురుగు, దుర్వాసన సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, జాయింట్ కమిషనర్ సునీత, చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపిచంద్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ వి.శంకర్, క్లస్టర్ ఏపీడీ శ్యామలాదేవి, ఎంపీడీవో కె.శివపార్వతి, సర్పంచ్ ఎం.జగన్, ఏపీవో ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



హ్యాకథాన్ పోటీల్లో కళ్లం విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: గ్లోబల్ గోల్స్ హ్యాకథాన్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళ్లం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాల ఏఐ డీఎస్ విభాగానికి చెందిన విద్యార్థులు ఇటీవల ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అమరావతిలో నిర్వహించిన గ్లోబల్ గోల్స్ హ్యాకథాన్ పోటీలలో పాల్గొని బెస్ట్ స్పీచ్ ప్రజెంటేషన్ అవార్డును గెలుచుకున్నారన్నారు. విద్యార్థులు వెంకటకల్యాణ్, శ్రీవల్లి, జోష్ కుమార్, గాయత్రిలకు హ్యాకథాన్ జ్యూరీ నుంచి విశేషమైన ప్రశంసలు లభించాయన్నారు. అవార్డులు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి ప్రశంసించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు తదితరులున్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఏఐ, సైబర్ సెక్యూరిటీపై ఓరియంటేషన్ ప్రోగ్రాం

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల డాక్టర్ వైఆర్ హరగోపాల్‌రెడ్డి సెమినార్ హాల్‌లో ఏఐ, సైబర్ సెక్యూరిటీపై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ ఐబీఎంకు చెందిన నరేంద్ర ముఖ్య వ్యక్తగా విచ్చేశారు. ఏపీ ఎస్ఎస్‌డీసీ ఐబీఎం స్కిల్ బిల్డ్, ఎడ్యునెట్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇంజనీరింగ్, ఎంఎస్ సీఎంసీఏ విద్యార్థులకు నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్‌గా విచ్చేసిన నరేంద్ర మాట్లాడుతూ ఏఐ టూల్స్, హాల్యూజినేషన్, జనరేటివ్ ఏఐ, గూగుల్ ట్రెండ్స్, జనరేటింగ్ ఇమేజెస్ తదితర అంశాలపై వివరించారు. ఐబీఎం స్కిల్ బిల్డ్ పోర్టల్‌లో ఉన్న 18 ఉచిత కోర్సులపై అవగాహన కల్పించారు. బుధవారం ఆర్ట్స్, ఫార్మసీ ఆర్కిటెక్చర్ విద్యార్థులకు వాణిజ్య భవన్‌లో జరుగుతుందని, ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఎస్‌డీసీ యూఎస్‌డీవో ఎండీ రఫీ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ చంద్రమౌళి, సీఎస్‌సీ విభాగపు సమన్వయకర్తలు డాక్టర్ చైతన్య, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ లావణ్య, డాక్టర్ సూర్య కామేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ నరేంద్ర

ఆర్‌వీఆర్‌జేసీలో 'కర్మణ్యే వాధికారస్తే' బృందం సందడి

గుంటూరు రూరల్: విద్యార్థులకు ఆలోచింపజేసే ఒక సస్పెన్స్, ఇన్వెస్టిగేటివ్ మిస్టరీ, థ్రిల్లర్ మూవీ 'కర్మణ్యే వాధికారస్తే' అని దర్శకులు అమర్‌దీప్ చల్లపల్లి తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో చిత్ర యూనిట్ సందడి చేసింది. ఉషస్విని ఫిలిమ్స్ పతాకంపై డీఎస్ఎస్ దుర్గాప్రసాద్ నిర్మాణ సారథ్యంలో అమర్‌దీప్ దర్శకత్వంలో, హీరో హీరోయిన్‌లుగా కృష్ణభట్, ఇరా దయానంద్, అయేషా, రెహానా ఖాన్‌లను నూతన పరిచయం చేస్తూ, బ్రహ్మాజీ, శత్రు, 'మాస్టర్' మహేంద్రన్ ప్రధాన పాత్రల్లో, బెనర్జీ, పృథ్వీ, శివాజీరాజా, అజయ్‌రత్నం, సుధ ముఖ్య పాత్రల్లో నటించిన 'కర్మణ్యే వాధికారస్తే' చిత్రం అక్టోబర్ 1 థియేటర్లలో ప్రేక్షకుల ముందు రానుందని డైరెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా చిత్ర బృందం విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకుని, వారితో కలిసి కళాశాలలో సందడి చేశారు. సందేశాత్మక చిత్రాల ద్వారా సమాజానికి మార్గదర్శనం చేయగలరని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మురళీమోహన్, డాక్టర్ జగదీష్‌లు తెలిపారు. మంచి విలువలు నేర్పే చిత్రాలు తెరకెక్కితే ప్రేక్షకుల ఆదరణ పెరుగుతుందని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కృష్ణప్రసాద్‌లు అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డైరెక్టర్ రవీంద్ర, ఏవో డైరెక్టర్ శ్రీనివాసరావు, రంగరాయచౌదరి తదితరులు చిత్ర యూనిట్‌ను సన్మానించారు.



కళాశాలలో సందడి చేస్తున్న చిత్రయూనిట్, కళాశాల యాజమాన్యం

అప్పు ఇచ్చిన వారు ఊరుకోక.. తీసుకున్న వారు ఇవ్వక

ప్రత్తిపాడు: అప్పులు ఇచ్చిన వారు తిరిగి చెల్లించాలని ఒత్తిడి తెస్తుండటం.. మరో వైపు అప్పులు తీసుకున్న వారు తిరిగి ఇవ్వకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో ఓ పురుగు మందుల వ్యాపారి తన దుకాణం ముందే దీక్షకు దిగాడు. మీకు అప్పులిచ్చి నేను జైలుకెళ్లలేను.. నా పరువు, నా ప్రాణం నేను నమ్మి అప్పులు ఇచ్చిన మీ చేతుల్లోనే.. అంటూ తన దుకాణం ఎదుట బైఠాయించి దీక్షకు పూనుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. ప్రత్తిపాడుకు చెందిన గొట్టం పరమేశ్వరరావు వేణు మిత్ర ఫెర్టిలైజర్స్ పేరుతో గత ఆరేడు సంవత్సరాలుగా పురుగుమందుల వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా రైతులు, ఖాతాదారులకు సుమారు రూ.58 లక్షల వరకు అప్పులిచ్చాడు. వారంతా తిరిగి చెల్లించకపోగా, షాపుకు రావడం మానేశారు. ఇదే సమయంలో పరమేశ్వరరావు షాపు నిర్వహణకు, కుటుంబ అవసరాలకు, కూతురి పెళ్లికి.. బయట వ్యక్తుల వద్ద రూ.37 లక్షలు అప్పు తీసుకున్నాడు. మందుల కంపెనీల వాళ్ల రూ.25 లక్షల సరుకును అప్పుగా ఇచ్చారు. గత కొంతకాలంగా అప్పులిచ్చిన వారు, కంపెనీల వాళ్ల పరమేశ్వరరావును డబ్బులిమ్మని అడుగుతున్నా సమాధానం చెబుతూ నెట్టుకొస్తున్నాడు. 4-5 నెలల కిందట కూతురి వివాహానికి డబ్బులు లేక, తాను అప్పులిచ్చిన వారిని చెల్లించమని అడిగినా ఫలితం లేదు. బ్యాంకు ఓడీలు, ఈఎంఐలు, కనీసం షాపు అద్దె కూడా కట్టలేని స్థితిలో ఉన్నాడు. విసిగి వేసారిన ఆ వ్యాపారి మంగళవారం ఉదయం నుంచి షాపు ముందే మౌన పోరాటం చేస్తున్నాడు. ఉదయం నుంచి రాత్రి వరకు ఏమీ తినకుండా దీక్షకు కూర్చున్నాడు. నాకు బాకీలు ఇవ్వవలసిన వాళ్ల సమాధానం చెప్పే వరకు ప్రతి రోజూ దీక్ష చేస్తూనే ఉంటానని పరమేశ్వరరావు తెలిపాడు.



దుకాణం ఎదుటే దీక్ష చేస్తున్న పరమేశ్వరరావు

రైతులకు సేంద్రియ ఎరువులు అందజేత

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువులను ఎంపిక చేసుకున్న రైతులకు టెర్మినేటెడ్ ఆర్గానిక్ మెషర్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులకు పులియబెట్టిన సేంద్రియ ఎరువులను అందజేశారు. కార్యక్రమంలో కేవీకే అధిపతి, అగ్రానమీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.యుగంధర్ వరి పంటలో ఈ ఎరువును చల్లుకోవటం వల్ల కర్బన శాతాన్ని పోషకాలను మొక్కలకు అందించటంలో తోడ్పడుతుందన్నారు. భూమిలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచటం, రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించటంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం గ్రామంలోని వరి పంటలను పరిశీలించి రైతులకు పొటాషియం, జింక్ లోపాలను గుర్తించి నివారణ చర్యలు తెలిపారు. కార్యక్రమంలో వంగా నవీన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



సేంద్రియ ఎరువుల బస్తాలను అందజేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు